క్లుప్తంగా

ఇంటి వద్దనే ఓటు



మహబూబాబాద్/గార్ల: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఫామ్– 12డీ ద్వారా దరఖాస్తు చేసుకున్న అర్హులైన దివ్యాంగులు, వయోవృద్ధులకు ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశం కల్పించినట్లు దివ్యాంగులు, వయో వృద్ధుల నోడల్ అధికారి, జిల్లా సంక్షేమాధికారి వరలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ఈనెల 5న కురవి, సీరోలు, డోర్నకల్, గూడూరు, మానుకోట, నెల్లికుదురు, దంతాలపల్లి, ఈనెల 6న మరిపెడ, దంతాలపల్లి, నర్సింహులపేట, చిన్నగూడూరు, కేసముద్రం, ఇనుగుర్తి, నెల్లికుదురులో ఓటింగ్‌కు రూట్ మ్యాప్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారిలో 85 సంవత్సరాలు పైబడిన వారు374, దివ్యాంగులు 383మందికి ఇంటి వద్ద ఓటు వేసే సదుపాయం కల్పించినట్లు స్పష్టం చేశారు.

బీఆర్‌ఎస్‌కు రాజీనామా



మహబూబాబాద్/డోర్నకల్: 2014 ఎన్నికల ముందు తనకు ఎమ్మెల్సీ ఇస్తానని మాజీ సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే హరీశ్‌రావు మోసం చేశారని, అందుకే బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్లు డోర్నకల్ బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నున్న రమణ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ బలోపేతం కోసం ఎంతో కష్టపడ్డానని, అభ్యర్థుల గెలుపు కోసం ఎంతో కృషి చేశానన్నారు. ఎమ్మెల్సీ ఇవ్వకపోగా ఖర్చు చేసిన డబ్బు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలోనే తన అనుచరులతో సమావేశమై నిర్ణయం తీసుకుంటానన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు గిరి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రెండా.. పన్నెండా..!

ఇసుక ట్రాక్టర్ల పట్టివేతపై చర్చ



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

చిన్నగూడూరు: ఆకేరువాగు నుంచి అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న ఇసుక ట్రాక్టర్ల పట్టివేతపై మండలంలో చర్చనీయాంశంగా మారింది. అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 12 ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు సోషల్ మీడియాలో వైరల్‌గా మారగా అధికారులు మాత్రం రెండే ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు లెక్కలు చూపుతున్నారు. 12 ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని రెండే ఇసుక ట్రాక్టర్లుగా అధికారులు తప్పుడు లెక్కలు చూపుతున్నారని మండలంలో చర్చగా మారింది. రెండు ఇసుక ట్రాక్టర్లపై కేసు నమోదు చేస్తే మిగిలిన ట్రాక్టర్లపై అధికారులు కేసు పెట్టారా.. లేక వదిలిపెట్టారా.. అని మండలంలో చర్చనీయాంశంగా మారింది. అధికారులు, ప్రజాప్రతినిధులు అండదండలతోనే అక్రమ ఇసుక రవాణా జరుగుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇదే విషయమై స్థానిక ఎస్సై స్నను వివరణ కోరగా రెండు ట్రాక్టర్లు మాత్రమే పట్టుకున్నట్లు తెలిపారు.

కారు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

దంతాలపల్లి: కారు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన శనివారం మండలకేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం మండలంలోని రామానుజాపురం గ్రామానికి చెందిన, అక్కిరెడ్డి రెడ్డి లింగారెడ్డి బైక్‌పై సొంత పనుల కోసం మండల కేంద్రానికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. రామానుజాపురం స్టేజీవద్ద టీఎస్ 26జీ 0066 నంబర్ గల కారు లింగారెడ్డి బైక్‌ను ఢీకొట్టడంతో లింగారెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం క్షతగాత్రుడిని తొర్రూరులో ఓ ప్రవేట్ ఆస్పత్రికి తరలించారు. ఢీకొట్టిన కారుపై ఎమ్మెల్సీ అనే స్టిక్కర్ ఉందని స్థానికులు చెప్పారు. ఎస్సై కరుణాకర్‌ను అడుగగా ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపాడు.

పోటాపోటీగా ఎన్నికల ప్రచారం

డోర్నకల్: డోర్నకల్‌తోపాటు పలు గ్రామాల్లో శనివారం పార్లమెంటు ఎన్నికల ప్రచారం ముమ్మరంగా కొనసాగింది. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బలరాంనాయక్‌ను గెలిపించాలని, బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో మాళోత్ కవితను, బీజేపీ ఆధ్వర్యంలో సీతారాంనాయక్‌ను గెలిపించాలని కోరుతూ ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు ఇంటింటా తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

విద్యుత్ ప్రమాదాల నివారణకు కృషి

కురవి: విద్యుత్ ప్రమాదాల నివారణ కోసం కృషి చేస్తామని విద్యుత్ శాఖ డీఈ విజయ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో విద్యుత్ భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని విద్యుత్ ప్రమాదాల నివారణ కోసం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకోకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటామని తెలిపారు. నాణ్యమైన సర్వీస్ వైర్లను వాడుకోవాలని సూచించారు. రైతులు ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద సొంతంగా పనులు చేసుకోవద్దని, పనులు ఉంటే విద్యుత్ ఉద్యోగులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీ రమేష్‌బాబు, ఏఈలు శారద, జయప్రకాశ్, సుమన్, కిరణ్, మహేందర్‌బాబు, సబ్ ఇంజనీర్స్, విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.



కురవి: మాట్లాడుతున్న డీఈ విజయ్



కేసముద్రం: పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

విద్యుత్ భద్రతా సూత్రాలు పాటించాలి

గూడూరు: సిబ్బంది తాము చేసే పనుల్లో విధిగా భద్రతా సూత్రాలు పాటించాలని మహబూబాబాద్ డివిజనల్ ఇంజనీర్ పి.విజయ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని కన్యకా పరమేశ్వరి ఫంక్షన్ హాల్‌లో శనివారం విద్యుత్ భద్రతా వారోత్సవాలను ఏడీఈ కె. కవిత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా భద్రత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. నిత్యం ప్రాణాలు పణంగా పెట్టి విధులు నిర్వహించే సిబ్బంది క్షేమంగా ఉండాలని విద్యుత్ శాఖ కోరుకుంటుందన్నారు. సిబ్బంది విధులు బాధ్యతగా వ్యవహరిస్తూ, ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏఈలు ప్రణీత్, అమ్ములు, సరేష్, సబ్ ఇంజనీర్ ప్రవీణ్, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలి

కేసముద్రం: ప్రతి ఒక్క వినియోగదారుడు విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ జనగాం నరేష్ సూచించారు. విద్యుత్ భద్రతా పొదుపు వారోత్సవాల సందర్భంగా మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం విద్యుత్ భద్రత, పొదుపు వారోత్సవాల వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఈ విజయ్‌కుమార్, ఏడీఈ శ్రీనివాసులు, ఏఈలు రాజు, శశిధర్ పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బంది జాగ్రత్తగా ఉండాలి

నర్సింహులపేట: విద్యుత్ ప్రమాదాలు జరగకుండా సిబ్బంది జాగ్రత్తగా ఉండాలని ఏఈ పాండునాయక్ అన్నారు. మండలంలోని కొమ్ములవంచ సబ్‌స్టేషన్‌లో శనివారం విద్యుత్ భద్రత వారోత్సవాల సందర్భంగా పోస్టర్లను ఏఈ ఆవిష్కరణ చేసి, సిబ్బందితో ప్రతిజ్ఞ చేసిన అనంతరం మాట్లాడారు. మే 7 వరకు వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ కిషన్, లైన్‌మేన్ మంగిలాల్, సిబ్బంది పాల్గొన్నారు

గెలిపించండి.. అండగా ఉంటా

- బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కవిత

గూడూరు: గతంలో తాను ఎమ్మెల్యేగా.. ఎంపీగా గూడూరు మండలాన్ని ఎంతో అభివృద్ధి చేశానని, ఇపుడు మళ్లీ గెలిపించండి అండగా ఉంటానని బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోతు కవిత అన్నారు. మండలంలోని బొల్లెపల్లి, పొనుగోడు, అయోధ్యపురం, మధనాపురం, బొద్దుగొండ గ్రామాలలో శనివారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు భరత్‌కుమార్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఆరె వీరన్న, కతార్‌సింగ్, సురేందర్ యాదవ్, సంపత్‌రావు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు రైతులపై వివక్ష

చిన్నగూడూరు/కురవి: రైతులు రైతుబంధు అడిగితే చెప్పుతో కొడతారా అని డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ ఆరోపించారు. శనివారం మండల కేంద్రంతో పాటు జయ్యారం, మన్నెగూడెం, మేఘ్యా తండా, ఉగ్గంపల్లి గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే రెడ్యా పర్యటించి ఆయా కార్యక్రమాల్లో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రైతులు రైతుబంధు అడిగితే చెప్పుతో కొడతారనడం కాంగ్రెస్ నాయకులకు రైతుల పట్ల వివక్షత కనుబడుతుందన్నారు. ఎంపీ అభ్యర్థి మాలోత్ కవితను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్ రెడ్డి, రాంసింగ్, చెన్నారెడ్డి, ఉప్పలయ్య పాల్గొన్నారు. కరవి మండలంలోని కందికొండ, సూదనపల్లి, బీబీనాయక్ తండా గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.



గూడూరు: పొనుగోడులో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కవిత

భారీ మెజార్టీతో గెలిపించాలి

మరిపెడ రూరల్: మాలోతు కవితను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎంపీపీ గుగులోతు అరుణ, జెడ్పీటీసీ సభ్యురాలు తేజావత్ శారద మండలంలోని పలు గ్రామాల్లో శనివారం వేర్వేరుగా ప్రచారం నిర్వహించారు.

నెల్లికుదురు: కారు గుర్తుకు ఓటు వేసి కవితను మెజార్టీతో గెలిపించాలని జెడ్పీటీసీ సభ్యుడు మేకపోతుల శ్రీనివాసరెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పరుపాటి వెంకట్‌రెడ్డి, జిల్లా నాయకుడు నల్లాని నవీన్‌రావు ఓటర్లను కోరారు.

బహుజన రాజ్యాధికారమే బీఎస్పీ లక్ష్యం

మహబూబాబాద్ అర్బన్: బహుజన బిడ్డల బతుకులు మారాలంటే బీఎస్పీ ఎంపీ అభ్యర్థిని గెలిపించాలని, బహుజన రాజ్యాధికారమే లక్ష్యంగా పని చేస్తామని బీఎస్పీ సెంట్రల్ కోఆర్డినేటర్ మథాపురం బాలయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని పలు సెంటర్‌లో శనివారం ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా బాలయ్య మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలిచిన కూడా బీజేపీలోకి వెళ్తున్నారన్నారు. అనంతరం ఎంపీ అభ్యర్థి కోనేటి సుజాత మాట్లాడుతూ.. ఏనుగు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపిస్తే పార్లమెంట్‌లో కొట్లాడి మానుకోటను అన్ని విధాల అభివృద్ధికి చేస్తానన్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ ఇన్‌చార్జ్ దార్ల శివరాజ్, జిల్లా ఇన్‌చార్జ్ విజయకాంత్, అధ్యక్షుడు ఉపేందర్, ఉపాధ్యక్షుడు నాగన్న, ప్రధాన కార్యదర్శి శ్రీను, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఉపేందర్ పాల్గొన్నారు.



టమాటాలను తూకం వేస్తున్న అభ్యర్థి సుజాత

హామీలను 'గ్యారంటీ'గా అమలు చేస్తాం

- ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

కురవి/మరిపెడ రూరల్: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతీ ఒక్క హామీని సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో 'గ్యారంటీ'గా అమలు చేసి తీరుతామని ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ అన్నారు. శనివారం సీరోలు మండలం చింతపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ భూక్యా చందూలాల్ ఆధ్వర్యంలో పలువురు బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. మరిపెడలోని పలు గ్రామాల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బలరాంనాయక్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు జెరిపోతుల మహేష్, సీరోలు, కురవి మండల పార్టీల అధ్యక్షులు కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, అంబటి వీరభద్రం, నాయకులు యుగేందర్‌రెడ్డి, శ్రీరంగారెడ్డి, మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీరారెడ్డి, శంకర్‌నాయక్,పాల్గొన్నారు.

ప్రజలకు అండగా ఉంటాం..

మహబూబాబాద్ రూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు హస్తం గుర్తుకు ఓట్లు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ కోరారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ గెలుపు కోరుతూ మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లి గ్రామంలో శనివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు రామిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



మరిపెడ రూరల్: ఉల్లెపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్



కేసముద్రంవిలేజ్‌లో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బయ్యారం: బలరాంనాయక్‌ను గెలిపించాలని శనివారం జగ్గుతండా పంచాయతీలో ఉపాధి పనుల వద్ద కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు.

గూడూరు: మండలంలోని లైన్‌తండా, వంపుతండా, మర్రిమిట్ట గ్రామాల్లో శనివా బలరాంనాయక్ గెలుపు కోసం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి స్వామి, పార్టీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు రాధ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

కేసముద్రం: బలరాంనాయక్‌ను గెలిపించాలని ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు, టీపీసీసీ రాష్ట్ర ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కోఆర్డినేటర్ మేకల వీరన్నయాదవ్ శనివారం కేసముద్రంవిలేజ్‌లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు తోట వెంకన్న, మాసాడి శ్రీనివాస్, బైరు వెంకన్న, కీర్తి సురేందర్, కత్తెరశాల శ్రీనివాస్, సత్తిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చిట్ల రవి, చిట్ల సంపత్ పాల్గొన్నారు.

గార్ల: బలరాంనాయక్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కాంగ్రెస్ నాయకులు శనివారం మండలంలో ప్రచారం నిర్వహించారు.

కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పాలి



గార్ల: ఉపాధి పనుల వద్ద ప్రచారం చేస్తున్న హరిప్రియ

గార్ల: ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని ఆచరణకు సాధ్యం కాని హామీలు అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీకి, లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ పిలుపునిచ్చారు. శనివారం మండలంలో బీఆర్‌ఎస్ ఎంపీ మాలోత్ కవిత గెలుపును కాంక్షిస్తూ మండలంలో ఆమె విస్తృత ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో, తండాల్లో, ఉపాధి కూలీల పని ప్రదేశాల వద్దకు వెళ్లి బీఆర్‌ఎస్ కారు గుర్తుకు ఓటేసి కవితను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్, ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్, బుడిగ మురళి, మాజీ సర్పంచ్ ఆర్ శంకర్, వీర్యానాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు చేసి.. ఓట్లు అభ్యర్థించి

పెద్దవంగర: మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో శనివారం పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి ప్రచార రథంపై కాంగ్రెస్ నాయకులతో కలసి పర్యటించారు. గ్రామాల్లో స్థానిక మహిళలు ఝాన్సీరెడ్డికి బొట్టుపెట్టి స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ గెలుపు కోరుతూ ప్రచారం చేపట్టారు. ప్రచారంలో భాగంగా గ్రామాల్లో ఉపాధిహామీ పనులను ఝాన్సీరెడ్డి చేశారు. చెయ్యి గుర్తుకే ఓటు వేసి వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కల్పన, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కేతిరెడ్డి నిరంజన్‌రెడ్డి, నెమరుగొమ్ముల ప్రవీణ్‌రావు, ముద్దసాని సురేష్, ముత్తినేని శ్రీనివాస్, దుంపల కుమారస్వామి పాల్గొన్నారు.



ఉపాధి హామీ పనుల్లో మట్టి తీస్తున్న ఝాన్సీరెడ్డి

విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి

కురవి: సీరోలు పోలీస్ స్టేషన్ పరిధిలోని కురవి మండలం కందికొండ గ్రామంలో విద్యుదాఘాతంతో విద్యార్థి నీలారపు అఖిల్(17) మృతి చెందినట్లు సీరోలు ఎస్సై విజయ్‌రాంకుమార్ శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కందికొండ గ్రామానికి చెందిన నీలారపు ఉప్పలయ్య కుమారుడు అఖిల్ శుక్రవారం రాత్రి తన ఇంటి వెనుక షెడ్డులో ఫ్యాన్ పనిచేయకపోవడంతో రిపేరు చేసేందుకు ప్రయత్నించాడు. దీంతో ఫ్యాన్‌కు విద్యుత్ సరఫరా అయి విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. కుటుంబసభ్యులు మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్సపొందుతూ మృతి చెందినట్లు పేర్కొన్నారు. శనివారం మృతుడి తండ్రి ఉప్పలయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ అఖిల్‌కు నివాళులర్పించి, బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు.



అఖిల్ (ఫైల్)

ఆకుల్లా రాలిపోతున్న గబ్బిలాలు

- ఎండ తీవ్రతతో మృత్యువాత

కేసముద్రం: ఎండతీవ్రతకు తాళలేక గబ్బిలాలు ఆకుల్లారాలిపోతున్న సంఘటన మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం కోమటిపల్లి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామంలోని శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయం పక్కనున్న వృక్షాలపై వందల సంఖ్యల్లో గబ్బిలాలు ఆవాసం ఏర్పాటు చేసుకున్నాయి. ప్రతి వేసవికాలంలో ఎండకు తాళలేక గబ్బిలాలు గుంపులుగుంపులుగా వెళ్లి ఇదే గ్రామశివారు చెరువు పక్కనున్న మర్రి చెట్లను ఆశ్రయిస్తాయి. అయితే కొద్దిరోజులుగా విపరీతమైన ఎండకు, వడగాలులకు ఆ గబ్బిలాలు తాళలేక మృత్యువాత పడుతున్నాయి. ఇప్పటికే పదుల సంఖ్యలో చెట్ల కొమ్మలకు వేలాడుతూ, మరికొన్ని నేలపై పడి గబ్బిలాలు మృత్యువాత పడ్డాయి. గతంలో గబ్బిలాలను ఎండతీవ్రత నుంచి బతికించేందుకు ఓదాత జీపీకి స్ప్రింక్లర్‌లను జీపీకి అందజేశాడని, ఒక్క ఏడాదిపాటే స్ప్రింక్లర్‌లతో చెట్ల కొమ్మలపై ఉన్న గబ్బిలాలకు నీళ్లను కొడుతూ రక్షించారని, ఆ తర్వాత స్ప్రింక్లర్‌లను మూలనపడేశారని స్థానికులు తెలుపుతున్నారు.



ఎండతీవ్రతతో మృతిచెందిన గబ్బిలం

బీజేపీని ఓడించాలి

కురవి: మతోన్మాద బీజేపీని పార్లమెంటు ఎన్నికల్లో ఓడించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు మండల వెంకన్న పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని కొత్తూరు(జీ) శివారు బంచరాయి తండాలో ఎంపీ అభ్యర్థి మోకాళ్ల మురళీకృష్ణను గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ కార్యదర్శి హెచ్.లింగన్న, నాయకులు బాబన్న, పాపయ్య, రూప్లా, దేవేందర్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

చలివేంద్రం ప్రారంభం



నెహ్రూసెంటర్: వేసవికాలం ప్రజలకు దాహార్తి తీర్చేందుకు మహబూబాబాద్ పట్టణ పోలీస్‌ల ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో చలివేంద్రాన్ని శనివారం సీఐ పెండ్యాల దేవేందర్, ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం.శివప్రసాద్ ప్రారంభించారు. కార్యక్రమంలో టౌన్ ఎస్సై ఉపేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని గాంధీపురం గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు రామసహాయం రామసీతమ్మ (102) శుక్రవారం రాత్రి మృతిచెందారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్, డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి, అర్బన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఘణపురపు అంజయ్య శనివారం నివాళులర్పించారు.

ఆర్థికసాయం

కురవి: మండలంలోని రాజోలు శివారు హరిదాసు తండాకు చెందిన తేజావత్ ఈరమ్మ ఆకస్మికంగా మృతి చెందింది. ఈమేరకు విజయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మాలోత్ రామారావు మృతురాలి కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సాయాన్ని శనివారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశాడు.

ఉపాధి పనుల పరిశీలన

నెల్లికుదురు: ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు నిధులను త్వరగా విడుదల చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి ఊడుగుల లింగన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పార్టీ ఆధ్వర్యంలో ఉపాధి పనలను పరిశీలించారు. కార్యక్రమంలో చిర్ర యాకన్న, నాగన్న, రాజశేఖర్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీ ఆధ్వర్యంలో ప్రచారం

బయ్యారం: మహబూబాబాద్ ఎంపీ స్థానం నుంచి పోటీ చేస్తున్న ఎన్డీ అభ్యర్థి మోకాళ్ల మురళీకృష్ణను గెలిపించాలని శనివారం మండలంలోని కొత్తపేట పంచాయతీ పరిధిలో పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, రమణారెడ్డి, వెంకన్న, గణేష్, రాజేశ్వరి, నర్సమ్మ పాల్గొన్నారు.

బెల్ట్‌షాపుపై పోలీసుల దాడి

గార్ల: మండలంలోని కోట్యానాయక్‌తండాకు చెందిన ధరంసోత్ నందు తన కిరాణం షాపులో అక్రమంగా మద్యం అమ్ముతుండగా, పోలీసులు దాడి చేసి 10మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై జీనత్‌కుమార్ శనివారం వెల్లడించారు.

ఘనంగా హనుమాన్ శోభాయాత్ర

కేసముద్రం: మండల కేంద్రంలో హనుమాన్ శోభాయాత్ర శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. సుమారు 50 మందికి పైగా హనుమాన్ మాల ధరించిన సందర్భంగా, స్వాములు, భక్తుల ఆధ్వర్యంలో స్థానిక భక్తాంజనేయస్వామి ఆలయం నుంచి శోభయాత్రను ప్రారంభించారు. కార్యక్రమంలో అర్చకులు శ్రవణ్‌శర్మ, భాస్కర్ శర్మ, భక్తులు ఓలం శ్రీను, పాదిల నర్సింహారెడ్డి, గాంతి వెంకట్‌రెడ్డి, రమేష్, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పార్లమెంట్ పరిశీలకుడిగా కిషన్‌నాయక్



బయ్యారం: మహబూబాబాద్ పార్లమెంట్ లీగల్ సెల్ పరిశీలకులుగా బయ్యారానికి చెందిన అడ్వకేట్ గుగులోత్ కిషన్‌నాయక్‌ను నియమిస్తూ జాతీయ లీగల్‌సెల్ కార్యదర్శి విపుల్ మహేశ్వరీ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

కోఆర్డినేటర్‌గా కత్తి స్వామి



గూడూరు: పార్లమెంట్ ఎన్నికల మేనేజ్‌మెంట్ కోఆర్డినేటర్ సభ్యుడిగా మండల కేంద్రానికి చెందిన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి స్వామిని నియమించినట్లు కమిటీ కన్వీనర్ కపిలవాయి దిలీప్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

కవితను గెలిపించాలి

మహబూబాబాద్ రూరల్: మాలోత్ కవిత కారు గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు కేఎస్ఎన్ రెడ్డి కోరారు. మహబూబాబాద్ మండలంలోని రేగడి తండా గ్రామంలో శనివారం బీఆర్‌ఎస్ బూత్ స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నాయిని రంజిత్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహబూబ్ పాషా, వైస్ ఎంపీపీ ఎల్ది మల్లయ్య, మండల అధ్యక్షుడు తేళ్ల శ్రీను, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్, అవుల వెంకన్న, తప్పెట్ల వెంకన్న పాల్గొన్నారు.

కూలి చెల్లింపుపై చర్చ

కేసముద్రం: మార్కెట్ బయట వ్యాపారులు కొనుగోలు చేస్తున్న వ్యవసాయోత్పత్తులకుగాను, రైతుల వద్ద వ్యాపారులు కట్ చేస్తున్న రూ.20ల కూలీ డబ్బులను నిబంధనల ప్రకారంగా తమకు ఇవ్వాలంటూ కార్మికులు ఇటీవల నిరసన తెలిపిన విషయం తెలిసిందే. దీనిపై శనివారం కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో మార్కెట్ స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ అమరలింగేశ్వర్‌రావు సమక్షంలో వ్యాపారులు, కార్మిక, రైతు సంఘాల నాయకులతో చర్చలు జరిపారు.

ఎంపీకి సన్మానం

గూడూరు: మండలంలోని బొద్దుగొండకు చెందిన కొట్టి జెస్సి అనే విద్యార్థినికి గత సంవత్సరం ఎంపీ హోదాలో మాలోతు కవిత కేంద్రియ విద్యాలయంలో సీటు ఇప్పించగా చిన్నారి అందులో చదువుకుంటుంది. శనివారం బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థిగా బొద్దుగొండలో ప్రచారం చేస్తున్న కవితను జెస్సి తన కుటుంబ సభ్యులతో కలసి సన్మానించింది.

పరామర్శ..

దంతాలపల్లి: మండలం పెద్దముప్పారం గ్రామానికి చెందిన గాదరబోయిన బక్కయ్య, బిక్షమమ్మల, కుమార్తె శిరీష ప్రభుత్వ ఉద్యోగం రాలేదని కొన్ని నెలల క్రితం హైదరాబాద్ నగరంలో ఆత్మహత్య చేసుకుంది. కాగా శనివారం కోదండరాం గ్రామంలోని శిరీష తల్లిదండ్రులతోపాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

బలరాంనాయక్‌కు మాతృవియోగం

మహబూబాబాద్ రూరల్/కేసముద్రం: మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ తల్లి లక్ష్మీబాయి శనివారం హనుమకొండలో అనారోగ్యంతో మృతి చెందారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మురళీనాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు భరత్‌చందర్‌రెడ్డిలు హనుమకొండలోని ఆమె మృతదేహాన్ని సందర్శించి, సంతాపం తెలిపారు. వారి వెంట మేకల వీరన్నయాదవ్, అల్లం నాగేశ్వర్‌రావు, కూరెల్లి సతీష్, బానోత్ వెంకన్న, తాజుద్దీన్ ఉన్నారు.

బీజేపీ గెలుపునకు కృషి చేయాలి

పెద్దవంగర: వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ గెలుపునకు బీజేపీ శ్రేణులు కృషి చేయాలని మండల ఇన్‌చార్జ్ శంకర్, జిల్లా ఉపాధ్యక్షుడు రంగు రాములు గౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బీజేపీ మండల అధ్యక్షుడు బొమ్మెరబోయిన సుధాకర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ నెల 8న వరంగల్‌లో నిర్వహించే ప్రధాని మోదీ సభకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో వడ్డెకొత్తపల్లి ఎంపీటీసీ సాయిని ఝాన్సీ, నాయకులు రవి, రాము, భాస్కర్, రాజు, అశోక్, శ్యామ్, ఆనంద్, రాజు, సందీప్ పాల్గొన్నారు.

